క్లుప్తంగా

సీఐగా బాధ్యతల స్వీకరణ



మరిపెడ: మరిపెడ సీఐగా రాజ్‌కుమార్‌గౌడ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వెస్ట్‌జోన్‌లో సీఐగా ఉన్న రాజ్ కుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా మరిపెడకు వచ్చారు. అంతకు ముందు ఇక్కడ పనిచేసిన హతీరాంనాయక్ వెస్ట్‌జోన్ వన్‌కు బదిలీపై వెళ్లారు.

తొర్రూరు సీఐగా బాధ్యతలు



తొర్రూరు: తొర్రూరు సీఐగా జగదీష్ ఆదివారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

దాడులను ఖండించాలి

మహబూబాబాద్ అర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుంచు శ్రీశైలం, విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మతంపేరుతో రాజకీయాలు, మతోన్మాదంతో హింసలు మానవాళికి ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, కవిత, అనిత, సువర్ణ, శ్రీనివాస్, ఉపేందర్, అంజయ్య పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ



గార్ల: మండలంలోని అంజనాపురం పెద్దకిష్టాపురం అడ్డ రోడ్డుపై నిర్మించిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆదివారం న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి మధు ఆవిష్కరించారు. విగ్రహాన్ని నిర్మించిన పార్టీ మండల కార్యదర్శి జి.సక్రును ఆయన అభినందించాడు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి సీహెచ్ గణేష్, సామ పాపయ్య, హెచ్ లింగన్న, మాన్యా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కురవి: నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం కురవిలోని పెట్రోల్‌బంక్ సమీపంలో 365 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవికి చెందిన అంగడి వెంకన్న అనే వ్యక్తి కురవి పెద్ద చెరువుపై కాపలా ఉంటున్నాడు. ఇంటి నుంచి చెరువు వద్దకు కాపలా కోసం రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్నాడు. ఈక్రమంలో మహబూబాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై సీరోలు మండలం తాళ్లసంకీసకు చెందిన ఒక వ్యక్తి వెంకన్నను ఢీకొట్టాడు. దీంతో వెంకన్న కుడి కాలు విరిగి తీవ్రంగా రక్తస్రావం అయింది. వెంటనే 108లో మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రబాబు

గార్ల: బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నేలం నాగేంద్రబాబును నియమిస్తూ ఆదివారం జిల్లా అధ్యక్షుడు సిరికొండ సంపత్ నియామకపు ఉత్తర్వు కాపీని అందజేశారు.

అవార్డు ప్రదానం



గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో గల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న తిరునగిరి యాద గిరిస్వామి ఆదివారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో అర్చన వైభవ రత్న అవార్డు అందుకున్నారు.

'సబ్‌రిజిస్ట్రార్'లో పేరు మార్పిడి

- మానుకోట మున్సిపాలిటీలో తిరస్కరణ
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు
- పేరుమారినా రిజెక్ట్ చేయడంతో అమ్మిన వారి పేరునే పన్నులు
- మున్సిపాలిటీలో గందరగోళం



మానుకోట మున్సిపాలిటీ కార్యాలయం

మహబూబాబాద్: సుమారు రెండు సంవత్సరాలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ తోపాటు పేరు మార్పిడి జరుగుతుంది. గతంలో రిజిస్ట్రేషన్ అయిన తర్వాత మున్సిపాలిటీ కార్యాలయంలో పేరు మార్పిడి చేసుకునే వారు. పట్టా భూమితోపాటు ప్రభుత్వ స్థలాల్లో గృహాల నిర్మాణం చేసుకున్నవి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పేరు మార్పిడి అవుతున్నాయి. కాగా మానుకోట మున్సిపాలిటీ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో పేరు మార్పిడిని రిజెక్ట్ చేస్తున్నారు. దాంతో కొనుగోలు చేసిన వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే..

ప్రభుత్వ స్థలాల్లో గృహ నిర్మాణం చేసిన వారు ఇంటి విక్రయాలు చేస్తే సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయగానే పేరు మార్పిడి జరుగుతుంది. గతంలో రిజిస్ట్రేషన్ పత్రాలతో మున్సిపాలిటీ కార్యాలయంలో పేరు మార్పిడి చేసుకునే వారు. కాని సుమారు రెండున్నర సంవత్సరాల నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మ్యూటేషన్/ట్రాన్స్‌ఫర్ అనే కాలంతో దానికి రూ.1000 ఫీజుతో పేరు మార్పిడి చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేయవద్దని..

గతంలో మానుకోట కలెక్టర్‌గా పని చేసిన గౌతమ్ ప్రభుత్వ స్థలాలకు వాటిలో నిర్మాణం చేసిన వాటికి ఇంటి నంబర్‌తో ఉన్నవి, లేఅవుట్‌లేని స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయవద్దని ఆదేశాలు జారీ చేయడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి జాబితా పంపించారు. కాని ఆదేశాలను పక్కన పెట్టారు.

అధికారుల వాదన ఇలా..

ఇళ్లకు, ఆ స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయవద్దని వారి శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు లేవని చెబుతున్నారు. పేరు మార్పిడి చేసిన తర్వాత మున్సిపాలిటీ కార్యాలయానికి లాగిన్‌కు జాబితా పంపిస్తాం. వారు ఆ పేర్లను రిజెక్ట్ చేయవద్దు. కాని మానుకోట మున్సిపాలిటీలోనే చేస్తున్నారు.

400లకు పైగా తిరస్కరణ

ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన ఆయా స్థలాల్లో గృహ నిర్మాణాలు చేసుకున్న వారు విక్రయాలు చేయగా పేరు మార్పిడి జరిగినవి సుమారు మానుకోట మున్సిపాలిటీలో 800వరకు ఉంటాయి. కాగా మానుకోట మున్సిపాలిటీలో సుమారు 400లకు పైగా రిజెక్ట్ చేశారు. ప్రభుత్వ స్థలాలవి లేఅవుట్ లేని స్థలాలలో గృహ నిర్మాణం చేసినవి, ఇంటి నంబర్‌తో ఉన్నవి కొనుగోలు చేసివారు లబోదిబోమంటున్నారు. రిజెక్ట్ చేయడంతో అమ్మిన వారి పేరునే పన్నులు ఇతరత్రా వస్తున్నాయి. దాంతో కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.

పేరు తొలగించారు



మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో మా తాత పేరున ఉన్న 120గజాల ఇంటిని 2022లో నా పేరున రిజిస్ట్రేషన్ చేశారు. కాగా వెంటనే పేరు మార్పిడి జరిగింది. రెండు సంవత్సరాలుగా నా పేరున ఇంటి పన్ను చెల్లించాను. ఇప్పుడు మున్సిపల్ అధికారులు రిజెక్ట్ చేయగా ఇంటి పన్ను మా తాత పేరున వస్తుంది.

– ఆర్.సామ్యు, బాధితుడు

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

మహబూబాబాద్ అర్బన్: క్రీడలతోనే పరస్పర స్నేహభావం పెంపొందుతుందని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో పోలీస్, మీడియా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆదివారం ఎస్పీ టాస్ వేసి ప్రారంభించారు. టాస్ గెలిచిన ప్రింట్ మీడియా జట్టు మొదటగా బ్యాటింగ్ చేసి 12ఓవర్లకు 10 వికెట్లు కోల్పోయి 49పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన పోలీసు జట్టు 8ఓవర్లకు 1 వికెట్ కోల్పోయి 50పరుగులు చేసి విజయం సాధించింది. అనంతరం ఎలక్ట్రానిక్ మీడియాతో పోలీస్ జట్టు తలపడింది. బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రానిక్ మీడియా 12 ఓవర్లకు 62 పరుగులు చేసింది. పోలీస్ జట్టు 11 ఓవర్లకు 63 పరుగులు చేసి విజయం సాధించి కప్‌ను గెలుచుకుంది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రజలను సన్మార్గంలో నడిపించడంలో కీలకపాత్ర పోషిస్తున్న మీడియా మిత్రులకు అభినందనలు తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ విధంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు తిరుపతిరావు, శ్రీనివాస్, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్సైలు పాత్రికేయులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం స్వాధీనం



పట్టుబడిన నల్లబెల్లం చూపిస్తున్న పోలీసులు

నెల్లికుదురు: అక్రమంగా కారులో తరలిస్తున్న 20బస్తాల నల్లబెల్లం, రెండు బస్తాల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం మండలం కల్వల గ్రామ శివారు ముత్యాలమ్మ తండాకు చెందిన గుగులోతు రమేష్, వాంకుడోతు సుమన్, భూక్య రామచంద్రు పరిసర ప్రాంతాలల్లో విక్రయించడానికి కారులో 20బస్తాల నల్లబెల్లం, రెండు బస్తాల పటిక తరలిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో కారుతో సహాపట్టుబడినట్లు పేర్కొన్నారు. బెల్లంతో ఉన్న కారును స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వర్గీకరణతో మాదిగలకు న్యాయం



మాట్లాడుతున్న ఎల్లయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు, 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోంఢ్ర ఎల్లయ్యమాదిగ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం క్రాంతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం అనేక ఏండ్లుగా పోరాటాలు చేసి ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సాధించుకోవడం మాదిగల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తుందన్నారు. వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన మాదిరిగా అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో పులి శ్రీను, సీహెచ్ రాధా, కుక్కల సుధారాణి, బాలకృష్ణ, సాంబయ్య, సంధ్య, ఎల్లయ్య, రమా, వీరభద్రం, రమేష్, అరుణ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కురుమ మురళీధర్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, రఘు, తదితరులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

శతాధిక వృద్ధురాలు..

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్‌బీ(110) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ఆరుగురు కూతుర్లు ఉన్నారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని వివిధ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి తప్పిన పాము గండం

దంతాలపల్లి: మండల కేంద్రంలో చెత్తకుప్పలు తీస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు నాగమ్మకు ఆదివారం పాము గండం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి గడి బజారుకు పోయే దారిలో నాగమ్మ చెత్తకుప్ప తీస్తున్న క్రమంలో చెత్తలో ఉన్న విషసర్పం రక్తపింజర పాము కార్మికురాలు చేతిలోకి వచ్చింది. గమనించిన ఆమె వెంటనే చెత్త కుప్పను కింద వేసింది. అక్కడే ఉన్న తోటి కార్మికులు పామును చంపేశారు. ప్రభుత్వం కార్మికుల చేతులకు తొడుగులు ఇవ్వాలని కార్మికులు వేడుకుంటున్నారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేస్తా..



రాజ్‌కుమార్‌కు తీర్మానపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నెహ్రూసెంటర్: పద్మశాలీల అభ్యున్నతి, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పద్మశాలీల సంఘం రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థి వల్లకంటి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న అధ్యక్షతన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర అధ్యక్ష పదవికి ఈనెల 18న జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన కోరారు. అధ్యక్ష అభ్యర్థికి మద్దతుగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో చందా మల్లయ్య, వేముల బాలరాజు, మచ్చ సుధాకర్, పగిడిమర్రి హరి, కుడికాల సమ్మయ్య, ఏ.రామకృష్ణ, పెండెం రమేష్, చిదిరాల ఉషారాణి పాల్గొన్నారు.

ముున్సిపాలిటీ సమస్యలపై దృష్టి సారించాం



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ వీరన్న

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక వెటర్నరీ ఆస్పత్రి సమీపంలోని ఖబ్రస్తాన్‌లో ఆదివారం విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను పరిశీలించిన చైర్మన్ వీరన్న మాట్లాడారు. మున్సిపాలిటీకి సంబంధించి కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని కొంతమంది చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. మున్సిపాలిటీకి మంజూరైన రూ.20కోట్ల ప్రత్యేక నిధుల్లో ఇప్పటి వరకు రూ.17.5కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటిలింగం, కౌన్సిలర్ బోరగళ్ల శరత్, పర్వీన్ సుల్తానా, నాయకులు ఖాదర్‌బాబా, మాదా శ్రీనివాస్, ఫరీద్, సుశీల్‌కుమార్, రజాలీ, ఇబ్రహీం, అజీత్‌మియా, సర్వర్, సుల్తాన్ పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామ్మూర్తి

నెహ్రూసెంటర్: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధించుకోవడం ద్వారానే సామాజిక న్యాయం అందుతుందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. సంఘం జిల్లా పట్టణ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితులు ఐకమత్యంతో ముందుకు సాగుతూ రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకోవాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై జిల్లా కేంద్రంలో నేడు కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యావంతులు, యువకులు, మహిళలు, సామాజిక సంఘాల నేతలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మందుల మహేందర్, మచ్చ వెంకన్న, సూర్నపు ముత్తయ్య, పాక నాగార్జున, పూల సతీష్ పాల్గొన్నారు.

వెంటనే మురుగు గుంతను పూడ్చాలి



గుంత వద్ద ఆందోళన చేస్తున్న తండావాసులు

మరిపెడ రూరల్: ఈనెల 5న తేదీన అదనపు కలెక్టర్ డేవిడ్ గ్రామానికి వస్తున్నారని, అధికారులు హడావుడిగా మురుగు నీరు కనబడకుండా గుంతను తవ్వి అలాగే వదిలేశారని, తక్షణమే గుంతను పూడ్చాలని పూసలతండా గిరిజన వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని ఎడ్జెర్ల గ్రామ శివారు పూసలతండాలో గుంత వద్ద ఆదివారం ఆందోళన చేపట్టారు. గుంతలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాపిస్తున్నాయన్నారు. వెంటనే గుంతను పూడ్చాలని అధికారులను వేడుకున్నారు. కార్యక్రమంలో తండా వాసులు బాదావత్ నారాయణ, బానోతు శ్రీను, బానోతు వీరన్న, బాదావత్ వెంకన్న, భూక్య నెహ్రూ పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాన్ని ఆదుకోవాలి



మరిపెడ: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

మరిపెడ: యువ జర్నలిస్టు యోగిరెడ్డి ఆయన కుమార్తెతో ఆత్మహత్య చేసుకోవడం విషాదకరమని, ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మరిపెడ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ రియాజ్‌పాషా, రాంపెల్లి వీరాంజీ అన్నారు. ఆదివారం రాత్రి వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు శ్రీరంగం శ్రీనువాస్, పెల్లి శ్రీశైలం, వేణు, రాజేష్, లచ్చయ్య పాల్గొన్నారు.

నెల్లికుదురు: జర్నలిస్టు యోగిరెడ్డి, తన కూతురు ఆద్య మృతికి మండల జర్నలిస్టులు, రాజకీయ నాయకులు ఆదివారం అంబేడ్కర్ సెంటర్‌లో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు అశోక్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, సుధాకర్, జగన్, శ్రీధర్, నగేష్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ముత్యాలమ్మకు భక్తులు బోనాలు సమర్పించుకున్నారు. తమ ఇళ్లలో బోనాలను తయారు చేసుకుని ఆలయాలకు వచ్చి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. శ్రావణ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావించే భక్తులు గ్రామ దేవతలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తల్లుల అనుగ్రహంతో వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండి, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: బోనాలతో వెళ్తున్న మహిళలు



మహబూబాబాద్ రూరల్: పాత బజారులో ఆలయానికి బోనాలతో వెళ్తున్న భక్తులు



మరిపెడ: ఆలయం చుట్టూ బోనాలతో తిరుగుతున్న మహిళలు



కురవి: బోనాలతో వెళ్తున్న మహిళలు



గూడూరు: బోనాలతో వెళ్తున్న మహిళలు



బోనంతో శివసత్తి ప్రదర్శన



దంతాలపల్లి: పెద్దముప్పారం గ్రామంలో..

తండాల అభివృద్ధే ధ్యేయం

మరిపెడ రూరల్: గిరిజన తండాల అభివృద్ధే ధ్యేయంగా ఐదేళ్లు కృషి చేశానని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తేజావత్ శారద అన్నారు. మరిపెడ మండలం మూలమర్రితండా గ్రామ పంచాయతీ పరిధిలో జెడ్పీ నిధుల నుంచి రూ.10లక్షలతో హైమాస్ట్ లైట్లను ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తేజావత్ రవీందర్ నాయక్, నాయకులు భూక్య రఘు, సక్రాం, హుస్సేన్, బాలాజీ, సోమాణి, తిరుపతి, శేషు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడితో గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెల వద్ద కొమురయ్య

గూడూరు: మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో నాలుగు గొర్రెలు మృతిచెందగా, మరో 6గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడు అన్న కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 15 గొర్రెలు ఇంటి వద్ద కొట్టంలో కట్టేసినట్లు తెలిపాడు. తెల్లవారు జామున చూసేసరికి నాలుగు గొర్రెలు మృతి చెంది, మరో ఆరు గాయపడి కనిపించాయని ఆవేదనతో తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కలను నియంత్రించాలని, జరిగిన నష్టానికి ప్రభుత్వ ఆర్థికసాయం అందించాలని కోరాడు.

అంబరాన్నంటిన తీజ్ సంబురాలు

బంజారాల సంప్రదాయానికి ప్రతీకైన తీజ్ పండుగను ఆదివారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో రోజు యువతులు తీజ్ బుట్టలను ఎత్తుకుని ర్యాలీగా వెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బయ్యారం: జగ్గుతండాలో నృత్యం చేస్తున్న బంజారా మహిళలు



మహబూబాబాద్ రూరల్: తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు



కురవి: తీజ్ బుట్టలతో యువతులు



మహబూబాబాద్ రూరల్: వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్ హరిసింగ్, తదితరులు



గార్ల: చిన్నకిష్టాపురంలో..